

ఇసుకేస్తే రాలనంత జనం.. సీటు దొరికేది కూడా కష్టమే!



బస్సుల్లో సీటు కోసం తంటాలు

- నేటి నుంచి 14 వరకు దసరా సెలవులు
- ఇంటిముఖం పట్టిన విద్యార్థులు
- బస్టాండ్లలో రద్దీ.. బస్సులు కిటకిట
- సరిపడా బస్సుల్లేక ప్రయాణికులకు ఇక్కట్లు



కిటకిటలాడుతున్న పాలమూరు బస్టాండ్



బస్సుల్లో సీటు కోసం ఫీట్లు..

# బడికి బైబై

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : విద్యార్థులకు ఈ నెలలో సెలవులే సెలవులు. ఈనెల 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 13 రోజులపాటు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించగా.. 15న తిరిగి పాఠశాలలు పునః ప్రారంభంకానున్నాయి. బుధవారం గాంధీ జయంతి కాగా.. దసరా సెలవులు ముగిసిన తర్వాత మళ్లా ఇదే నెలలో దీపావళి పండుగకు సెలవులు రానున్నాయి. సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇంటిబాట పట్టారు. వసతి గృహాల్లో ఉన్న పిల్లలను వారి తల్లిదండ్రులు వచ్చి ఇండ్లకు తీసుకెళ్లారు. దీంతో బస్టాండ్లు, బస్సులు, ప్రైవేట్ వాహనాలు కిటకిటలాడాయి. సరిపడా బస్సుల్లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాగులు, లగేజీలు తీసుకెళ్లేందుకు నరకయాతన పడ్డారు. బతుకమ్మ, విజయ దశమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కాగా స్కూళ్లల్లో చివరి రోజు విద్యార్థులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. బతుకమ్మలు సిద్ధం చేసి ఆడిపాడారు.

***విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు***

గురుకులాలు, వసతిగృహాలు, పాఠశాలల్లోని విద్యార్థులపై ఆయా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చనున్నారు. దసరా సెలవుల నేపథ్యంతో పదో తరగతి విద్యార్థులపై దృష్టి కేంద్రీకరించేలా పాఠశాల విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకున్నారు. రోజువారి షెడ్యూల్ అనుగుణంగా విద్యార్థులు చదువుకోవడం, రాసుకోవడం, అసైన్‌మెంట్లు, ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రణాళికలతో ముందుకు సాగనున్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులు కచ్చితంగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టనున్నారు. ఎస్‌ఏ-1 పరీక్షల షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగేలా విద్యార్థులకు ఇప్పటికే సూచనలు చేశారు. ప్రధానంగా నీటి కుంటలు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. పుస్తక పఠనంపై దృష్టి సారించేలా.. తల్లిదండ్రులతో నిత్యం సంభాషించేలా అధికారులు సిద్ధమయ్యారు.



భద్రం బ్రదరూ..



సంబురాల్లో మునిగిపోయిన గులాబీ శ్రేణులు, కార్మికులు

## బీఆర్‌ఎస్‌కేవీ విజయఢంకా

- మార్చాల సూర్యలత కాటన్‌మిల్లు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీపై అపూర్వ విజయం
- 68 ఓట్లతో గెలుపొందిన సూర్యప్రకాశ్‌రావు
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మిన్నంటిన సంబురం
- హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కార్మికులు



సూర్యప్రకాశ్‌రావు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 1 : కల్వకుర్తి మండలం మార్చాల సత్యసాయినగర్ సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో మంగళవారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ బలపరిచిన అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. సూర్యలత కాటన్ మిల్లులో కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ బలపరిచిన అభ్యర్థిగా సూర్యప్రకాశ్‌రావు, ఐఎన్‌టీయూసీ(కాంగ్రెస్) అభ్యర్థిగా మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ బరిలో ఉన్నారు. మంగళవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 450ఓట్లకు గానూ 438 ఓట్లు పోలవ్వగా అందులో 251ఓట్లు సూర్యప్రకాశ్‌రావుకు 183 ఓట్లు ఆనంద్‌కు మార్ ఓట్లు పోలవగా 4ఓట్లు చెల్లని ఓట్లుగా నమోదుకాగా 68ఓట్ల మెజార్టీతో సూర్య ప్రకాశ్‌రావు విజయం సాధించారు. సూర్య ప్రకాశ్‌రావు విజయం సాధించడంతో అభిమానులు, కార్మికులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకొన్నారు.

కాటన్ మిల్లు నుంచి కల్వకుర్తి పట్టణం ఆయా చౌరస్తాల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. పటాకులు కాలుస్తూ నృత్యాలు చేసుకుంటూ కార్మికులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.



సూర్యప్రకాశ్‌రావును సన్మానిస్తున్న జైపాల్‌యాదవ్

***కాంగ్రెస్‌పై వ్యతిరేకత : జైపాల్***

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో కాటన్ మిల్లు కార్మికులు బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థికి విజయం కట్టబెట్టి.. కాంగ్రెస్ పార్టీకి పరాభవాన్ని అందించారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థిని అధ్యక్షుడికి ఎన్నుకున్న కార్మికులకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమన్నారు. సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఈ విజయం కార్మికులదని. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ గోవర్ధన్, కౌన్సిలర్లు శ్రీశైలం, భోజిరెడ్డి, సైదులుగౌడ్, మార్చాల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# ఇండ్లు కూల్చడమే ప్రజాపాలనా?

- హైడ్రా.. డ్రామా కంపెనీగా మారింది
- పేదల ఇండ్లపైకి బుల్డోజర్లతో దాడి
- గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తారనే మూసీని ముందరేసుకున్నారు
- కందనూలులో తండ్రీ కొడుకులు తెలిసీతెలియని రాజకీయం చేస్తుండ్రు
- కాంగ్రెస్ వార్డులకే నిధుల కేటాయింపు
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే మర్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 1 : కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, ప్రజాపాలన కొనసాగిస్తామని మాయమాటలు చెప్పి పేదలతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత బుల్డోజర్లతో వారి ఇండ్లనే కూలదోయడమే ప్రజాపాలనగా కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయోగిస్తున్న బుల్డోజర్లు ధనవంతులపైకి వస్తే బాగుండేదని, పేదల ఇండ్లపైకి రావడంతో తాము ఓటు వేసి తప్పుచేశామనే మాటను పేదల నోటి నుంచే వినిపిస్తున్నాయన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చి రెండింటిని మాత్రమే అమలు చేసి మిగతా వాటికి ఎగనామం పెట్టారన్నారు. రూ.4 వేల పింఛన్ మరిచారని, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసేలేదని, రుణమాఫీ మధ్యలోనే నిలిపివేశారని, గృహజ్యోతి అంతంతే అమలవుతుందని, డిసెంబర్ 9కే రూ.2 లక్షల రుణాలకు దరఖాస్తు చేసుకోమన్న వారు నేడు ఇచ్చిన రుణాలను మాఫీ చేయలేకపోగా మాయమాటలతో ప్రజల్ని మోసం చేశారన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉంటే ఇచ్చిన గ్యారెంటీలను ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో డైవర్షన్ పనులను ముందర పెట్టుకున్నారని విమర్శించారు. వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన హరీశ్‌రావుపై రాళ్ల దాడి, పేదలను పరామర్శించడానికి వెళ్లిన కేటీఆర్ కారుపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. మీ మాదిరి పదేండ్లలో మేము ఇలాగే ప్రవర్తిస్తే మీరు బయట తిరిగేవారా, పాదయాత్ర చేసేవారా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో ఓ కంపెనీతో మాట్లాడుకొని పేద ఇండ్లను కూల్చడమేపనిగా పెట్టుకున్నారన్నారు. రూ.15 వేల కోట్లు సంపాదించాలన్న ఆలోచనతో, కుట్రబుద్ధితో కూలదోసుడుకు పూనుకున్నారన్నారు. మూసీపై ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. చేతనైతే వేల మంది పేదల మూసి చుట్టూ ఉన్నారని ముందు వారికి ఇండ్లు కట్టించు అని సూచించారు. కష్టపడి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఇల్లు నిర్మించుకుంటే కమర్షియల్ దందాను ముందరేసుకున్నారన్నారు. హైడ్రా వచ్చిందని చాలా మంది బిల్డర్లు భయపడి రాత్రి కలిసొస్తే ఉదయం వారివైపు హైడ్రా పోవడం లేదని, అమాయకులైన పేదల ఇండ్లను మాత్రం కూలదోస్తున్నారని విమర్శించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో తండ్రీకొడుకులు తెలిసీతెలియని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వీరి వల్ల అధికారులు బలవుతున్నారని, ఇందుకు ప్రజలు నష్టపోతున్నారన్నారు. పదేండ్ల రాజకీయంలో తాను ఎక్కడా కక్షసాధింపుగా పోలేదని, రైతులకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు పూర్తికోసం ప్రయత్నం చేశానని, మెడికల్ కాలేజీ కావాలని ప్రయత్నం చేశానని, జిల్లా కావడానికి ప్రయత్నించినా, ఏదీ చేసినా ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ప్రయత్నం చేశానని కక్షసాధింపులకు పోలేదన్నారు. తాను చేసిన అభివృద్ధి తప్పితే కొత్తగా మీరు చేసిందేమిటో చెప్పాలన్నారు. చేతనైతే జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ తేవాలని అన్నారు. పట్టణానికి చెందిన పాలమూరు శివ అనే యువకుడికి వినాయక నిమజ్జనం సందర్భంగా అరెస్టు చేయించారని, నిమజ్జనంలో అంతమంది ఉండగా ఒక్కడిపైనే కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కార్యకర్త అనే ఉద్దేశంతో కేసు పెట్టి జైలుకు పంపించారని, జైలుకు పంపినంత మాత్రాన కార్యకర్తలు భయపడరన్నారు. తొమ్మిది నెలల్లో తొమ్మిది మందిని జైలుకు పంపించావు కానీ అభివృద్ధి ఏమాత్రం చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పుట్టిందే జైళ్ల నుంచి, ఉద్యమాల నుంచి అని గుర్తు చేశారు. ప్రభుత్వాలు ఎప్పుడూ శాశ్వతం కాదని మళ్లీ మా రోజులు వస్తాయని, పోలీసులు నాయకుల మాటలు నమ్మి మీ ఉద్యోగాలకు ముప్పుతెచ్చుకోవద్దన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ మీటింగ్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ లేకుండా నిధులు కేటాయించడం సరికాదన్నారు. ఈ విషయంలో ఎంతటి వరకైనా వెళ్తామన్నారు. అన్ని వార్డులకు న్యాయం జరగాలని, కాంగ్రెస్ మున్సిపల్ సభ్యులు ఉన్నవార్డులకే నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. నేను చేసిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు, ఎవడో సంసారం చేస్తే పుట్టిన బిడ్డకు ముద్దుపెట్టుకున్నట్లు ఉంది మీ అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. ఏదీ ఏమైనా నమ్మి ఓట్లేసిన ప్రజల్ని నట్టేట ముంచారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పులేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అర్థం రవి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి సఫారీ యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ


## నల్లమలలో సఫారీ షురూ..

- ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

అమ్రాబాద్, అక్టోబర్ 1 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో సఫారీ యాత్ర షురూ అయ్యింది. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, అటవీ శాఖాధికారులతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫర్హాబాద్ ముఖద్వారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటీఆర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జంగల్ సఫారీ యాత్రలో వృక్షజాలం, జంతుజాలం గురించి పర్యాటకులకు వివరిస్తూ యాత్ర ముందుకు సాగుతుందని వివరించారు. అనంతరం అటవీ శాఖాధికారులు మాట్లాడుతూ సఫారీ వాహనంలో ఒక నేచర్‌గైడ్ ఉండి అడవి, సంపద, ప్రకృతి అందాల గురించి వివరిస్తారని తెలిపారు. అనంతరం శ్రీశైలం మల్లన్న దర్శనానికి మంత్రి బయలుదేరారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పర్యాటకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

- నాగర్‌కర్నూల్ జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి



ఫర్హాబాద్ వద్ద వన్యప్రాణి సంరక్షణ బేస్ క్యాంప్

అమ్రాబాద్, అక్టోబర్ 1 : నేటి నుంచి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అచ్చంపేట, కొల్లాపూర్, నాగార్జునసాగర్ వరకు విస్తరించి ఉన్న ఈ అడవిలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. అభయారణ్యంలో కృష్ణానది ప్రవాహం, వన్యప్రాణులు, శ్రీశైల క్షేత్రం, ఆక్టోపస్, మల్లెల తీర్థం, లొద్ది, సలేశ్వరం తదితర చూడదగిన ప్రదేశాలతో నల్లమల విరాజిల్లుతుందని చెప్పారు. నేటి నుంచి ప్రారంభమయ్యే వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఐదు రోజులు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, ఇతర పోటీలు నిర్వహిస్తామని, నిత్య జీవితంలో అడవుల ఆవశ్యకత, జంతువుల సంరక్షణ, వన్యప్రాణుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అడవిలో అధికారులు చేపడుతున్న సంరక్షణ చర్యలతో పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఈ ఏడాది అధికారుల నివేదిక మేరకు పులుల సంఖ్య 34కు చేరిందని వివరించారు. మన్ననూర్‌నుంచి శ్రీశైలం పాతాళగంగ వరకు ప్లాస్టిక్‌ను నిషేధించామని, ఇందుకు యాత్రికులు, పర్యాటకులు సహకరించడం సంతోషకరంగా ఉందన్నారు.



పెద్దకారుపాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## రుణం కోసం రైతు రణం

- పెద్దకారుపాముల బ్యాంక్ ఎదుట ధర్నా

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 1 : పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పెద్దకారుపాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన రైతులకు వెంటనే రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ పరిధిలో రూ.14 కోట్ల రుణమాఫీ అందజేశామని, దసరా పండుగ తర్వాత కొత్త రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీను, మద్దిలేటితోపాటు రైతులు పాల్గొన్నారు.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు విద్యాలయాలు, కార్యాలయాల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు. మహబూబ్‌నగర్ ఐడీవోసీలో కలెక్టర్ విజయేందిర బోయి అధికారులతో కలిసి బతుకమ్మలకు పూజలు చేశారు.